క్లుప్తంగా

నిరుద్యోగులకు ఉపాధి కల్పించాలి

అచ్చంపేట రూరల్: నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించి సమస్యను పరిష్కరించాలని డీవైఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడు సైదులు డిమాండ్ చేశారు. సోమవారం అచ్చంపేటలో నిరుద్యోగుల వివరాలపై డీవైఎఫ్‌ఐ ఆధ్వర్యంలో సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా సైదులు మాట్లాడుతూ రాష్ట్రంలో నిరుద్యోగ సమస్య తీవ్రంగా ఉందని ఆరోపించారు. గ్రూప్‌- 2, గ్రూప్‌- 3 పోస్టులు పెంచాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా పరిశ్రమలు స్థాపించి నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు చూపించే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో డీవైఎఫ్‌ఐ అధ్యక్షుడు మహేష్, అనీల్, మహేష్, లక్ష్మణ్, సంతోష్, రాములు, నవీన్ పాల్గొన్నారు.

స్టడీ హాల్ ప్రారంభం

కల్వకుర్తిరూరల్: పట్టణంలో నిరుద్యోగ యువత కోసం ఏర్పాటు చేసిన స్టడీ హాల్‌ను సోమవారం ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్, భగీరథ మాజీ వైస్ చైర్మన్ ఉప్పల వెంకటేష్ ప్రారంభించారు. ఇంట్లో చదువుకునే అవకాశం లేని వారికి స్టడీహాల్ ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. అనంతరం స్టడీహాల్ డైరెక్టర్ నవీన్‌కుమార్‌ను ఉప్పల వెంకటేష్ అభినందించారు. కార్యక్రమంలో గణేష్, పూరిరమేష్, కిశోర్, శ్రీను, రామకృష్ణ, నాగరాజు, నరేందర్, యాదయ్య, బీమయ్య, ఖాజ తదితరులు పాల్గొన్నారు.

గెస్ట్ లెక్చరర్లను విధుల్లోకి తీసుకోవాలి

కల్వకుర్తిరూరల్: ప్రభుత్వ ఇంటర్మీడియెట్ కళాశాలలో 180 మంది గెస్ట్ లెక్చరర్లను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని గెస్ట్ లెక్చరర్ల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు సదానందంగౌడ్ డిమాండ్ చేశారు. సోమవారం పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉన్నతాధికారుల స్పందించి గెస్ట్ లెక్చరర్లను విధుల్లోకి తీసుకోవాలని కోరారు.

ఉద్యోగులకు పదవీ విరమణ సహజం

నాగర్‌కర్నూల్ క్రైం: ప్రభుత్వ ఉద్యోగులకు పదవీ విరమణ సహజమని ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్ అన్నారు. పదవీవిరమణ పొందిన ఏఎస్‌ఐ ఖాజాయోయినోద్దీన్, అస్లం ఖాన్, సద్దె బాలరాజును సోమవారం జిల్లా ఎస్పీ కార్యాలయంలో సన్మానించారు. విధులను అంకితభావంతో నిర్వర్తిస్తే గుర్తింపు వస్తుందని పేర్కొన్నారు.

డాక్టరేట్ గ్రహీతకు ఘన సన్మానం

ఉప్పునుంతల: సామాజిక సేవా దృక్పథానికి గుర్తింపుగా తమిళనాడు రాష్ట్రంలోని ఓ యూనివర్శిటీ నుంచి గౌరవ డాక్టరేట్ అవార్డును పొందిన మండల కేంద్రానికి చెందిన కొత్త చిన్న జంగిరెడ్డిని సోమవారం స్థానిక కేదారేశ్వర ఆలయం ఆవరణలో గ్రామస్తులు పూలమాలలు, శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, యువకులు, మహిళలు పాల్గొన్నారు.

ప్రైవేటు పాఠశాల తీరుపై బీఎస్పీ ఆగ్రహం

బిజినేపల్లి: మండల కేంద్రంలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో పాఠ్యపుస్తకాల అమ్మకంపై బీఎస్పీ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం పాఠశాలను సందర్శించిన వారు సందర్శించారు. నోట్ పుస్తకాలు అమ్ముతున్నట్లు గుర్తించి ఈ విషయాన్ని ఎంఈఓ దృష్టికి తీసుకెళ్లారు. నాయకులు పృథ్వీరాజ్, కల్యాణ్, రాంచందర్, శివకృష్ణ, శేఖర్, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

చెట్లుంటేనే మానవ మనుగడ

కల్వకుర్తిరూరల్: చెట్లుంటేనే మానవ మనుగడ సాధ్యమని మాజీ కౌన్సిలర్ దుర్గాప్రసాద్ అన్నారు. మాతృమూర్తుల గౌరవంగా మొక్కలు నాటాలని ప్రధాని నరేంద్రమోదీ ఇచ్చిన పిలుపు మేరకు ఆయన మొక్కలు నాటారు. కార్యక్రమంలో పార్వతి, పట్టణ అధ్యక్షుడు నర్సింహ, జిల్లా ఉపాధ్యక్షుడు రాఘవేందర్‌గౌడ్, రవిగౌడ్, శ్రీకాంతాచారి, శ్రీకాంత్, లక్ష్మీనర్సింహ, కాలనీవాసులు పాల్గొన్నారు.

హాస్టళ్లను సందర్శించిన ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు

నాగర్‌కర్నూల్‌రూరల్: ప్రభుత్వ వసతి గృహాలలో చదువుకుంటున్న విద్యార్థుల పెండింగ్ కాస్మోటిక్ చార్జీలను వెంటనే చెల్లించాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి తారాసింగ్ డిమాండ్ చేశారు. సోమవారం పట్టణంలోని పలు ప్రభుత్వ హాస్టల్‌లను సందర్శించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. తక్షణమే విద్యాశాఖ మంత్రిని ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు వంశీ, అభినయ్, కల్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

కేసు నమోదు

తెలకపల్లి: మండల కేంద్రంలో సైకిల్‌ను ఢీకొన్న ఘటనలో పోలీసులు ఆదివారం ఉదయం కేసు నమోదు చేశారు. ఎస్‌ఐ నరేష్ తెలిపిన వివరాల ప్రకారం మండల కేంద్రానికి చెందిన సురేష్ సైకిల్‌పై వెళ్తుండగా రాకొండ గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ శివ సైకిల్‌ను ఢీకొట్టాడు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

పక్కాగా నల్లాల లెక్క..


మండల కేంద్రంలో సర్వే నిర్వహిస్తున్న కార్యదర్శి


సర్వేను పరిశీలిస్తున్న ఎంపీడీఓ జ్యోతిపరోసియా

- ఇప్పటికే 6 వేలకు పైగా ఇళ్ల సర్వే పూర్తి
- వివరాలు ప్రత్యేక యాప్‌లో నమోదు

తాడూరు: గ్రామీణ ప్రాంత ప్రజలకు తాగునీరు అందించాలనే ఉద్దేశ్యంతో గత ప్రభుత్వం రూ. కోట్లు ఖర్చు చేసి మిషన్ భగీరథ పథకానికి శ్రీకారం చుట్టింది. ఇంటింటికి నల్లా కనెక్షన్ ఇచ్చి శుద్ధ జలాన్ని అందించేందుకు చర్యలు చేపట్టారు. ఇంటింటికి పైప్‌లైన్ వేసి తాగునీరు సరఫరాకు ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారు. ప్రస్తుతం ముఖ్యమంత్రిగా రేవంత్‌రెడ్డి బాధ్యతలు చేపట్టాక మిషన్ భగీరథపై ప్రత్యేక దృష్టి సారించారు. ఈ పథకం ద్వార క్షేత్రస్థాయిలో నీరు అందుతుందా లేదా అని వివరాలు తెలుసుకోవడంతోపాటు కేంద్ర నిధులు పొందేందుకుగాను ఇంటింటి సర్వే చేపట్టాలని నిర్ణయించారు. ఎన్నికల కోడ్ ముగిసిన అనంతరం రాష్ట్ర వ్యాప్తంగా సర్వే ప్రారంభం అయ్యింది. ప్రత్యేకంగా రూపొందించిన యాప్‌లో పంచాయతీ కార్యదర్శులు ఇంటింటికి వెళ్లి మిషన్ భగీరథకు సంబంధించిన వివరాలు నమోదు చేస్తున్నారు. ఇప్పటికే శిక్షణ పూర్తి చేసుకున్న కార్యదర్శులు పంచాయతీలలో సర్వే చేయడంతో చేయడంలో నిమగ్నం అయ్యారు. మండలంలోని 24 గ్రామపంచాయతీలలో ఇంటింటి సర్వేను ముమ్మరం చేశారు. శుక్రవారం మండలంలోని ఐతోల్, శిర్సవాడ, పాపగల్, బలాన్‌పల్లి, మేడిపూర్, మండల కేంద్రమైన తాడూరు సర్వేను ముమ్మరం చేశారు. మండలంలో 9420 కనెక్షన్‌లకుగాను 6381 కనెక్షన్‌లకు సంబంధించి సర్వే పూర్తి చేశారు. 3039 ఇండ్లను సర్వే చేయాల్సి ఉంది. కొత్తగా 2743 నల్లాలకు దరఖాస్తులు అందాయి. 6 వేలకు పైగా నల్లాల సర్వే పూర్తి అయినట్లు అధికారులు పేర్కొన్నారు.

వివరాలు ఇలా..

ప్రతి రోజు నిర్దేశించిన ఇళ్లను సర్వే అధికారులు సందర్శిస్తున్నారు. మిషన్ భగీరథ పథకం క్షేత్రస్థాయిలో ఏ మేరకు అమలు అవుతుందో అడిగి తెలుసుకుంటున్నారు. ఇంటింటికి మిషన్ భగీరథ నల్లా కనెక్షన్ ఉందా లేదా అని వివరాలు నమోదు చేస్తున్నారు. ట్యాంకునీరు ఏమేర నల్లాల ద్వార ఇళ్లకు అందుతుందో పరిశీలిస్తున్నారు. ఒక్కో ఇంటికి ఎన్ని లీటర్ల నీటిని అందిస్తున్నారు. ఎక్కడైన లీకేజీలు ఉన్నాయా అన్న వివరాలతోపాటు ఆధార్, ఫోన్ నెంబర్ అదేవిధంగా ఆ ఇంటి కుటుంబ సభ్యుడి ఫోటో యాప్‌లో పొందుపరుస్తున్నారు. గ్రామ పంచాయతీ కార్యదర్శి, అంగన్‌వాడీ వర్కర్, మహిళా సంఘం సభ్యుల నేతృత్వంలో ఇంటింటికి వెళ్లి సర్వే నిర్వహిస్తున్నారు. వివరాలను మండల కార్యాలయం నుంచి ఉన్నతాధికారులకు డేటా పంపిస్తున్నారు. మిషన్ భగీరథ రిజర్వాయర్‌లు నీటి పంపులు, ట్యాంకులు, పైపు లైన్‌ల వివరాలు సైతం యాప్‌లో పొందుపరుస్తున్నారు.

సమగ్ర సర్వే నిర్వహిస్తున్నాం..

భగీరథ పథక లక్ష్యం ఏ మేరకు అమలు అవుతుందో క్షేత్రస్థాయిలో సర్వే నిర్వహిస్తున్నాం. ఎక్కడైన సమస్య ఉంటే పూర్తిస్థాయిలో వివరాలు నమోదు చేస్తున్నాం. ప్రత్యేక యాప్‌లో సర్వే వివరాలు ఆన్‌లైన్‌లో పొందుపరుస్తున్నాం. పక్కాగా నల్లా కనెక్షన్ వివరాలు నమోదు చేసి సమగ్ర నివేదికను ఉన్నతాధికారులకు పంపిస్తున్నాం.

– హేమంత్‌రెడ్డి, మిషన్ భగీరథ ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ

కలెక్టర్‌కు జర్నలిస్టుల సన్మానం

నాగర్ కర్నూల్: నూతనంగా కలెక్టర్‌గా బాధ్యతలు తీసుకున్న కలెక్టర్ బదావత్ సంతోష్‌ను నాగర్‌కర్నూల్ ప్రెస్‌క్లబ్ సభ్యులు సోమవారం కలెక్టర్ చాంబర్‌లో ఆయనను కలిసి పుష్పగుచ్ఛం ఇచ్చి సన్మానించారు. జర్నలిస్టు పిల్లలకు ప్రైవేటు పాఠశాలల్లో ఉచిత విద్య అందించేందుకు సర్క్యులర్ జారీ చేయాలని విజ్ఞప్తి చేశారు. దీనికి కలెక్టర్ సానుకూలంగా స్పందించారు. కార్యక్రమంలో ప్రెస్‌క్లబ్ సంఘం నాయకులు పుట్టపాగ వెంకటస్వామి, కంది కొండ మోహన్, సీనియర్ జర్నలిస్టులు కిషోర్, మహమ్మద్ దర్వేష్, కొండకింది మాధవ రెడ్డి, ఎండీ నజీర్ అహ్మద్, రాంబాబు, ఎస్ఎస్ బాబు, శివ, శ్యామ్, దశరథం, భరత్, విజయభాస్కర్, సహదేవుడు, వెంకట్ రెడ్డి, ప్రసాద్, నేతాజీ గౌడ్, కేశవ్, జయన్న, సైదులు, సురేష్ వివిధ పత్రికల జర్నలిస్టులు పాల్గొన్నారు.

స్కిల్ యూనివర్సిటీ కోసం స్థల పరిశీలన

వెల్దండ: మండల కేంద్రంలోని సర్వే నెంబర్ 342లో ఉన్న ప్రభుత్వం భూమిని సోమవారం తహసీల్దార్ రవికుమార్ పరిశీలించారు. ప్రభుత్వం మంజూరు చేసే స్కిల్ డెవలపర్స్ యూనివర్సిటీ కోసం ఉన్నత అధికారుల ఆదేశాల మేరకు స్థలాన్ని పరిశీలించినట్లు తహసీల్దార్ పేర్కొన్నారు. యూనివర్సిటీ ఏర్పాటు కోసం ప్రభుత్వం 100 నుంచి 150 ఎకరాల స్థలం అవసరం ఉందని తెలిపారు. వారి వెంట రెవెన్యూ సిబ్బంది తదితరులు ఉన్నారు.

ఘనంగా వైద్యుల దినోత్సవం


నాగర్‌కర్నూల్ వైద్యులను సన్మానిస్తున్న కార్మికులు


డాక్టర్ స్వరూపను సన్మానిస్తున్న సిబ్బంది


వైద్యులను సన్మానిస్తున్న పలు సంఘాల నాయకులు

నాగర్‌కర్నూల్‌రూరల్: పట్టణంలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో జాతీయ వైద్యుల దినోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులను సిబ్బంది, కార్మికులు శుభాకాంక్షలు తెలిపి సన్మానించారు. కరోనా కాలంలో వైద్యుల సేవలు మరిచిపోలేమని వారు కొనియాడారు. కార్యక్రమంలో కార్మికులు ఉన్నారు.

నాగర్‌కర్నూల్ క్రైం: రోగుల ప్రాణాలు రక్షించేందుకు వైద్యులు నిరంతరం పాటుపడాలని జనరల్ ఆస్పత్రి సూపరింటెండెంట్ డా.రఘు కోరారు. సోమవారం జాతీయ వైద్యుల దినోత్సవాన్ని జనరల్ ఆస్పత్రిలో నిర్వహించుకున్నారు. అనంతరం వైద్యులు, సిబ్బందితో కలిసి కేక్‌కట్ చేశారు.

కల్వకుర్తి టౌన్: ప్రపంచ వైద్యుల దినోత్సవం సందర్భంగా పట్టణంలోని సీహెచ్‌సీలో వైద్యులకు పలు సంఘాల నాయకులు సోమవారం ఘనంగా సన్మానించారు. కరోనా కాలంలో వైద్యుల సేవలను మరిచిపోలేమన్నారు. ప్రాణాలకు తెగించి వైద్యం అందించారని పలువురు గుర్తు చేశారు. కార్యక్రమంలో వైద్యులు దామోదర్ రెడ్డి, స్వర్ణలత, శివరాం, యశోదాభాయి, విష్ణు, ఇతర వైద్య సిబ్బంది, ఆయా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

వెల్దండ: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జాతీయ డాక్టర్స్ డే సందర్భంగా వైద్యులను సన్మానించారు. ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ సమాజ సేవలో డాక్టర్ వృత్తి ఎంతో కీలకమన్నారు. తల్లిదండ్రులు జన్మనిస్తే డాక్టర్లు పునర్ జన్మనిస్తారన్నారు. అనంతరం కేక్‌కట్ చేసి పంచుకున్నారు. కార్యక్రమంలో డాక్టర్ స్వరూప, సిబ్బంది తదితరులు ఉన్నారు.

చారకొండ: మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో గ్రామీణ వైద్యులు అంతర్జాతీయ డాక్టర్స్ డే సందర్భంగా కేక్ కట్ చేసి వేడుకలను జరుపుకున్నారు. వైద్యురాలు మంజుభార్గవిని గ్రామీణ వైద్యులు శాలువాతో సన్మానించారు. విరబొమ్మ శ్రీనివాసులు, శ్రీనివాసులు, హరినాథ్, రాజు, రాంబాబు, ప్రతాప్ గౌడ్, వాసవీ క్లబ్ సభ్యులు ఉన్నారు.

మన్ననూర్: అమ్రాబాద్ మండల మాజీ జెడ్పీటీసీ డాక్టర్ అనురాధను మన్ననూర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు వెంకటరమణ మాట్లాడుతూ అమ్మ జన్మనిస్తే వైద్యుల పునర్జన్మను ఇస్తారని అన్నారు.

అక్రమ కేటాయింపులపై ఫిర్యాదు

కల్వకుర్తిరూరల్: పట్టణంలోని 99 సర్వే నెంబర్‌లోని ప్రభుత్వ భూమిలో కొందరు వ్యక్తులు అనాధికారికంగా ప్లాట్లు చేసి తహసీల్దార్ కార్యాలయం ద్వార ప్రొసీడింగ్స్ ఇప్పిస్తున్నారని వీటిపై విచారణ చేసి చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ నాయకుడు నీరటి మల్లేష్ సోమవారం తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. సర్వే నెంబర్ 99లో జిల్లా పరిషత్ బాలుర పాఠశాల వెనకభాగంలో ఆర్‌టీఓ కార్యాలయం కోసం కేటాయించిన స్థలానికి ఉత్తర వైపు ఉన్న ప్రభుత్వ ఖాళీ స్థలంలో 120 గజాల చొప్పున ప్లాట్లు చేసి పట్టణానికి చెందిన కొందరు అమ్ముకున్నారని వివరించారు. ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించుకునే వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

డిప్యూటీ తహసీల్దార్‌పై చర్యలు తీసుకోండి

మన్ననూర్: తప్పుడు ఆధారాలతో మా స్వంత భూమిని పాలి భాగస్తుల పేరు మీద పట్టా చేసిన అచ్చంపేట డిప్యూటీ తహసీల్దార్ అశోక్‌పై చర్యలు తీసుకోవాలని సోమవారం నాగర్‌కర్నూల్ ప్రజావాణిలో బాధితురాలు కోన బాలమ్మ ఫిర్యాదు చేశారు. బాధితురాల వివరాల ప్రకారం అచ్చంపేట మండలం సిద్దాపూర్‌లో కోన లక్ష్మయ్య పేరున 4.075 ఎకరాల వ్యవసాయ పొలం ఉన్నది. బ్రతుకుదెరువు కోసం గత 25 ఏళ్ల క్రితం కోన లక్ష్మయ్య భార్యతో కోన లక్ష్మమ్మతో కలిసి మన్ననూర్‌కు వచ్చాడు. ఐదేళ్ల కిందట లక్ష్మయ్య అనారోగ్యంతో మృతి చెందాడు. ఈ క్రమంలో లక్ష్మయ్య పేరున ఉన్న భూమిని అక్రమంగా పట్టా చేసుకున్న వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

నిత్యావసర సరుకుల పంపిణీ

లింగాల: రూరల్ డెవలప్‌మెంట్ ట్రస్ట్(ఆర్డీటీ) ఆధ్వర్యంలో సోమవారం మండల కేంద్రంలోని ఆర్డీటీ కార్యాలయం ఆవరణలో పేద చెంచులకు ఎస్‌ఐ జగన్‌మోహన్ నిత్యావసర సరకులను పంపిణీ చేశారు. లింగాల, బల్మూర్, పెద్దకొత్తపల్లి, కొల్లాపూర్ మండలాలకు చెందిన 72 కుటుంబాలకు సరకులను అందజేసినట్లు ఏటీఎల్ రాధ తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌డబ్ల్యూఓ బాలస్వామి, ఆర్డీటీ సిబ్బంది పాల్గొన్నారు.

జిల్లా కార్యాలయ భవన నిర్మాణానికి భూమి పూజ



నాగర్‌కర్నూల్: జిల్లా కేంద్రంలోని కొల్లాపూర్ చౌరస్తా సమీపంలో నిర్మించనున్న బీజేపీ జిల్లా కార్యాలయ భవన నిర్మాణానికి జిల్లా అధ్యక్షుడు ఎల్లేని సుధాకర్‌రావు సోమవారం భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీజేపీ పార్టీని జిల్లాలో క్షేత్రస్థాయిలో గ్రామ గ్రామాన బలోపేతం చేసేందుకు ప్రతి కార్యకర్త కృషి చేయాలన్నారు. ప్రధాన కార్యదర్శులు రాజవర్ధన్ రెడ్డి, కృష్ణగౌడ్, రాష్ట్ర నాయకులు నరేందర్‌రావు, సుబ్బారెడ్డి, కిసాన్ మోర్చారాష్ట్ర అధికార ప్రతినిధి శేఖర్‌గౌడ్, రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ సుధాకర్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు రాము పాల్గొన్నారు.

బొగ్గుగనుల వేలాన్ని నిలిపివేయాలి

కల్వకుర్తిరూరల్: కేంద్ర ప్రభుత్వం వెంటనే బొగ్గుగనుల వేలాన్ని నిలిపివేయాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు అబ్బాస్ డిమాండ్ చేశారు. సోమవారం పట్టణంలోని సీపీఎం కార్యాలయంలో ఆ పార్టీ జిల్లా కమిటీ సమావేశానికి ముఖ్య అతిథిగా ఆయన హాజరై మాట్లాడారు. బొగ్గుగనుల వేలాన్ని ఉపసంహరించుకోవాలని కోరారు. జిల్లా కార్యదర్శి పర్వతాలు, ఆంజనేయులు, దేశియనాయక్, అంజనేయులు, బాల్‌రెడ్డి, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

విజయవంతం చేయండి

నాగర్‌కర్నూల్‌రూరల్: హైదరాబాద్‌లోని ఈఎంజీ రాష్ట్ర కార్యాలయం ఎదుట ఈ నెల 3న మహాధర్నా నిర్వహిస్తునట్లు ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి మారేడు శివశంకర్ అన్నారు. సోమవారం జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్ రఘుకు వినతిపత్రం సమర్పించారు. అదేవిధంగా ఆస్పత్రులలో పనిచేస్తున్న కార్మికులు ధర్నాకు తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో ఆస్పత్రి కార్మికులు అజ్మీర, నాగమణి, పీరమ్మ, శిరీష, ఏఐటీయూసీ నాయకులు కపిలవాయి, గోపి తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలను అరికడదాం

నాగర్‌కర్నూల్‌రూరల్: సమాజంలో బాల్య వివాహాలను నియంత్రించే బాధ్యత అందరిపై ఉందని నాగర్‌కర్నూల్ అధ్యాపక సంఘం నాయకులు బాగవేణి నర్సింహులు అన్నారు. సోమవారం స్థానిక జూనియర్ కళాశాలలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. మహిళా శిశు, దివ్యాంగుల, వయోవృద్ధుల సంక్షేమ శాఖ నిర్వహించిన ఈ సమావేశంలో ప్రొటెక్షన్ ఆఫీసర్ బి మల్లేష్ తదితరులు పాల్గొనగా ప్రతి ఒక్కరు బాల్య వివాహాలు జరుగకుండా నియంత్రించాలని విజ్ఞప్తి చేశారు. అధ్యాపకులు రవి, ప్రకాష్, వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

మౌలిక వసతులు పరిశీలన

మన్ననూర్: స్థానిక గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలను సోమవారం ఎస్ఎస్‌యూఐ విద్యార్థి సంఘం నాయకులు సందర్శించారు. ఈ సందర్భంగా భోజనం, కిచెన్, తాగునీటి వసతి, టాయిలెట్స్, తరగతి గదులను పరిశీలించారు. ఎస్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు సంతోష్, వర్కింగ్ ప్రసిడెంట్ యశ్వంత్, నాయకుడు హన్మంత్ పాల్గొన్నారు.



నైపుణ్యాభివృద్ధి కళాశాలను ఏర్పాటు చేయాలని వినతి


తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

వెల్దండ: ప్రభుత్వం నిరుద్యోగ యువతి, యువకుల కోసం ఏర్పాటు చేసే నైపుణ్యాభివృద్ధి కళాశాలను మండల కేంద్రంలో ఏర్పాటు చేయాలని కోరుతూ సోమవారం తహసీల్దార్ రవికుమార్‌కు బీజేపీ నాయకులు వినతిపత్రం అందజేశారు. కళాశాల ఏర్పాటుకు మండలంలో అనుకూలమైన స్థలం ఉందని వివరించారు. హైదరాబాద్-శ్రీశైలం, హైదరాబాద్-తిరుపతి రోడ్డు సౌకర్యం, ఇంటర్‌నేషనల్ ఏయిర్‌పోర్ట్ ఉండడంతో నిరుద్యోగులకు ఎంతో మేలు జరుగుతుందని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి సర్వే చేసి కళాశాల ఏర్పాటుకు కృషి చేయాలని కోరారు. జంగయ్యయాదవ్, బాలస్వామి, రాజేందర్‌రెడ్డి,శ్రీశైలం తదితరులు ఉన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య


విద్యార్థులకు నోట్‌పుస్తకాలు అందజేస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, నాయకులు

వెల్దండ: ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్యలభిస్తుందని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి పేర్కొన్నారు. సోమవారం కొట్రలోని ఉన్నత పాఠశాలల్లో విద్యార్థులకు దాత రవీందర్‌రావు సహకారంతో అందిస్తున్న నోట్‌పుస్తకాల పంపిణీ కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. ప్రభుత్వం పేద విద్యార్థులకు ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ఇంగ్లీష్ మీడియం ఏర్పాటు చేసిందన్నారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులకు ప్రభుత్వం అందిస్తున్న వసతులను సద్వినియోగం చేసుకొని ఉన్నత చదువులకు చేరుకోవాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన వారే ఉన్నత స్థాయి ఉద్యోగాలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. తల్లిదండ్రులు విద్యార్థులకు సకాలంలో పాఠశాలకు పంపించాలన్నారు. అనంతరం నోట్‌పుస్తకాలను అందజేశారు.

ఎమ్మెల్యేకు ఘన సన్మానం..

కల్వకుర్తి ఎమ్మెల్యేగా కసిరెడ్డి నారాయణరెడ్డి గెలుపొంది మొదటి సారిగా కొట్రకి రావడంతో కాంగ్రెస్ పార్టీ నాయకులు, అభిమానులు, ఉపాధ్యాయులు శాలువాలతో ఘనంగా సన్మానించారు. ప్రభుత్వం అందిస్తున్న నిధులతో పాఠశాల అభివృద్ధికి తనవంతుగా కృషి చేస్తామన్నారు. అదే విధంగా జిల్లా పరిషత్ వైస్‌చైర్మన్ బాలాజీసింగ్ పదవి కాలం ముగియడంతో ఆయన్ను శాలువాలతో కార్యకర్తలు సన్మానించారు. గ్రామానికి చెందిన పోనుగోటి రవీందర్‌రావు జన్మదినం సందర్భంగా ఎమ్మెల్యే, జిల్లా పరిషత్ వైస్ చైర్మన్‌లతో పాటు నాయకులు శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు భూపతిరెడ్డి, సంజీవ్‌కుమార్, మోతిలాల్, పర్వత్‌రెడ్డి, శ్రీనివాస్‌యాదవ్, కృష్ణముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

అర్హులైన ప్రతి ఒక్కరికీ రైతు భరోసా


మాట్లాడుతున్న ఎమ్మెల్యే కూచుకుళ్ల రాజేష్‌రెడ్డి

నాగర్‌కకర్నూల్: వ్యవసాయం చేసే అర్హులైన ప్రతి రైతులకు రాష్ట్ర ప్రభుత్వం రైతుభరోసా అందిస్తుందని నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే కూచుకుళ్ల రాజేష్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని సింగిల్ విండో కార్యాలయంలో చైర్మన్ బండారు శ్రీనివాస్‌రెడ్డి అధ్యక్షతన మహాజన సభ సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతు సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తోందన్నారు. అర్హులైన ప్రతీ ఒక్కరికి రైతుభరోసా అందించేందుకు ప్రభుత్వం ప్రతీ గ్రామం నుంచి రైతుల ద్వారా అభిప్రాయ సేకరణ చేపట్టిందని, రైతులు ఈ సమావేశాల్లో అందించిన అభిప్రాయాలను రాష్ట్ర ప్రభుత్వానికి నివేదిస్తామన్నారు. రైతులు అభిప్రాయాలు రాత పూర్వకంగా తీసుకొని తీర్మానం చేశారు. అంతకుముందు మొదటి సారిగా సింగిల్‌విండోకు వచ్చిన ఎమ్మెల్యే కూచుకుళ్ల రాజేష్‌రెడ్డిని చైర్మన్, డైరెక్టర్లు, రైతులు పూలమాలలు, శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో జిల్లా సహకార అధికారి రఘునాథ్ రావు, అసిస్టెంట్ రిజిస్ట్రార్లు రవికుమార్, ఇందిరమ్మ ఏఓ నర్మద, సంఘం డైరెక్టర్లు ఆవంచ రాజు, డి. రాజవర్ధన్ రెడ్డి, ఎస్. అనంతయ్య, గోపాల్ రెడ్డి, ఎరుకలి రాములు, రొయ్య బాలమశయ్య, బి.తిరుపతయ్య, వి. నాగిరెడ్డి, వివిధ గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, రైతులు పాల్గొన్నారు.

చెంచు మహిళ ఈశ్వరమ్మకు న్యాయం చేయాలి


మాట్లాడుతున్న ప్రజాసంఘాల నాయకులు

మన్ననూర్: కొల్లాపూర్ మండలం మొలచింతలపల్లి గ్రామానికి చెందిన చెంచు మహిళ ఈశ్వరమ్మకు న్యాయం చేయాలని కేఎన్‌పీఎస్ జిల్లా కన్వీనర్ ముద్దునూరి లక్ష్మీనారాయణ, ఆదివాసి హక్కుల పోరాటకమిటీ బల్మూర్ గోపాల్ డిమాండ్ చేశారు. సోమవారం మన్ననూర్‌లో వారు స్థానిక విలేకరులతో మాట్లాడారు. మొలచింత పల్లి గ్రామంలో భయాందోళనలో ఉన్న చెంచులకు రాష్ట్ర ప్రభుత్వం రక్షణ చర్యలు చేపట్టాలన్నారు. బాధితురాలికి రూ. 5 లక్షల ఆర్థికసాయం, పక్కా ఇల్లు, ముగ్గురు ఆడ పిల్లలకు గురుకుల పాఠశాలల్లో విద్యావకాశాలు కల్పించాలని కోరారు. చెంచుల అభివృద్ధి కోసం మన్ననూర్‌లో ఏర్పాటు చేసిన ఐటీడీఏకు ఐఏఎస్ అర్హత కలిగిన ప్రాజెక్టు అధికారితో పాటూ పూర్తి స్థాయిలో సిబ్బందిని నియమించాలన్నారు. ప్రతి చెంచు పెంటలో చెంచులు సాగు చేసుకుంటున్న వ్యవసాయ భూములకు ఆర్‌ఓఎఫ్ఆర్ పట్టాలు ఇవ్వాలని కోరారు. ఆదివాసి చెంచులకు పూర్తి స్థాయిలో సంక్షేమం, భద్రత కల్పించాలని రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సీతక్కకు విజ్ఞప్తి చేశారు. సమావేశంలో ప్రజా సంఘాల నాయకులు పౌరహక్కుల సంఘం ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా ప్రధాన కార్యదర్శి జక్క బాలయ్య, ప్రజాఫ్రంట్ రాష్ట్ర కో కన్వీనర్ అంబయ్య, గోరటి అనిల్ పాల్గొన్నారు.

బాలలకు బాలామృతాన్ని అందించాలి


అంగన్‌వాడీ కేంద్రంలో తల్లులకు సరుకులను అందిస్తున్న సూపర్‌వైజర్ పద్మావతి

కల్వకుర్తి టౌన్: అంగన్‌వాడీ కేంద్రాల్లో 0–5 ఏళ్ల పిల్లలకు బాలామృతాన్ని అందించాలని కల్వకుర్తి అంగన్‌వాడీ సూపర్‌వైజర్ పద్మావతి అన్నారు. సోమవారం పట్టణంలోని 19వ వార్డు సుభాష్‌నగర్ కాలనీలో అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారుల వయసుకు తగిన బరువు ఉన్నారా లేదా అని పరిశీలించారు. తక్కువ బరువు ఉన్న పిల్లలకు బాలామృతం ప్లస్ అందించాలని తల్లులకు సూచించారు. చిన్నారులను ప్రతిరోజు కేంద్రానికి పంపించాలని వారి తల్లిదండ్రులను కోరారు. అనంతరం సరుకులు అందజేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ అలివేలు, భాగ్యమ్మ, పిల్లల తల్లులు, చిన్నారులు పాల్గొన్నారు.

ప్రజలకు రుణపడి ఉంటాం


బాలాజీ సింగ్‌ను సన్మానిస్తున్న నాయకులు

చారకొండ: మండల ప్రజలకు ఎల్లప్పుడు రుణపడి ఉంటామని జిల్లా వైస్ చైర్మన్ బాలాజీసింగ్ అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలో జెడ్పీటీసీ పదవి కాలం ముగింపు సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మండలాన్ని శక్తిమేర అభివృద్ధి చేశానని పేర్కొన్నారు. డీసీసీ జిల్లా ఉపాధ్యక్షుడు వెంకటయ్య యాదవ్, సింగిల్ విండో చైర్మన్ గుర్వయ్య గౌడ్, మండల నాయకులు యాతం శ్రీను, ప్రశాంత్ నాయక్, శ్రీను, సుల్తాన్, గోపాల్ బాలాజీ సింగ్‌ను శాలువాతో, పూలమాలలతో సన్మానించారు.

రైతు భరోసాపై అభిప్రాయ సేకరణ


రైతులతో మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయ అధికారి చంద్రశేఖర్

పెంట్లవెల్లి: మండలంలోని సహకారం సంఘం చైర్మన్ విజయరామరావు ఆధ్వర్యంలో సోమవారం అత్యవసర సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా జిల్లా వ్యవసాయ అధికారి చంద్రశేఖర్ హాజరై మాట్లాడారు. రైతుభరోసాపై రైతుల ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టినట్లు పేర్కొన్నారు. పలువురు రైతులు అభిప్రాయం అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా ఏ కాలంలో ఏ పంట వేయాలో పంటపై ఎలాంటి చర్యలు తీసుకోవాలనే విధానంపై అవగాహన కల్పించారు. సొసైటీలో విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉంటాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ సహాయ సంచాలకులు రవికుమార్, ఏఓ రమేష్, సింగిల్ విండో చైర్మన్ విజయరామారావు, డైరెక్టర్లు బాలరాజు, గడ్డం శేఖర్, హనుమంతు, ఎర్ర శ్రీనివాసులు, సొసైటీ సిబ్బంది వెంకట్, ఏఈఓలు గోవిందు తదితరులు పాల్గొన్నారు.

రవాణా రంగ కార్మికుల నిరసన


నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు

నాగర్‌కర్నూల్‌రూరల్: దేశంలో రవాణా రంగాన్ని విచ్ఛిన్నం చేసే చట్టాన్ని రద్దు చేయాలని సీఐటీయూ రాష్ట్ర నాయకులు పొదిల రామయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం శ్రీపురం రోడ్డులో కార్మికులతో కలిసి నిరసన వ్యక్తం చేశారు. మూడోసారి అధికారంలోకి వచ్చిన బీజేపీ ప్రభుత్వం భారతన్యాయ సంహిత చట్టాన్ని తీసుకొచ్చి రవాణా రంగ కార్మికుల బతుకులపై మట్టికొడుతోందని ఆరోపించారు. ట్రాన్స్‌పోర్ట్ జిల్లా కార్యదర్శి శ్రీనివాస్, పట్టణ లారీ డ్రైవర్స్ యూనియన్ అధ్యక్షుడు ఆరీఫ్, వెంకటేష్, శ్రీనివాస్ పాల్గొన్నారు.